చినుకు పడితే అంతరాయం!


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒరిగిన స్తంభం


వైర్లకు చుట్టుకున్న చెట్ల తీగలు

- సాలార్‌నగర్‌ను వెంటాడుతున్న కరెంటు కష్టాలు
- ఆన్‌ఆఫ్‌లు లేకపోవడంతో నిత్యం సమస్యలు
- వైర్లను పాకిన పిచ్చిమొక్కల తీగలు

గండేడ్: మండలంలోని సాలార్‌నగర్‌లో కరెంటు కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో సుమారు 500మంది జనాభా ఉన్నా.. 200వరకు కడపలు ఉన్నాయి. గ్రామానికి విద్యుత్ సరఫరా చేసేందుకు రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశారు. వీటికి ఆన్ ఆఫ్ లేకపోవడంతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతోపాటు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి వైర్లకు పాకాయి. ఈ పిచ్చి మొక్కలు మూడు వైర్లకు అల్లుకోవడంతో చినుకు పడితే చాలు సరఫరాలో అంతరాయ కలుగుతోంది. బుధవారం రాత్రి వర్షం పడడంతో రాత్రి కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. రాత్రంతా చిమ్మచీకట్లో ఉండాల్సి వచ్చింది. గతంలో కూడా చాలాసార్లు గ్రామస్తులు సమస్యను సరిదిద్దాలని కోరినా.. అధికారులు పూర్తిస్థాయిలో నివారణ చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. అంతేకాక ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు కూడా శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. స్తంభాలు కూడా పలుచోట్ల ఒరిగి ఉన్నాయి. దీంతోపాటు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ కూడా గ్రామ సమీపంలో ఉండడంతో అదికూడా ప్రమాదకరంగా మారింది. వర్షం పడ్డ ప్రతిసారి ఇబ్బందులు కలగకుండా అధికారులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

> **రెండ్రోజుల్లో మరమ్మతు చేయిస్తాం**
>
> గ్రామంలో సమస్య ఉన్న విషయం తన దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం రాత్రి సరఫరాలో అంతరాయం కలిగింది. ఉదయం వెంటనే సరిచేశాం. చెట్ల కొమ్మలు తొలగించడంతో కంచెలు ఆన్‌ఆఫ్ వంటివి కూడా రెండు రోజుల్లో పూర్తి చేస్తాం.
>
> – శ్రీకాంత్, ఏఈ ట్రాన్స్‌కో, గండేడ్

క్లుప్తంగా

బొడ్రాయి పండుగలో మాజీ మంత్రి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని పాత పాలమూర్‌లో శుక్రవారం నిర్వహించిన బొడ్రాయి పండుగ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలిసి కట్టుగా పండుగలు జరుపుకోవాలన్నారు. బొడ్రాయి పండుగలు మనుషుల్లో ఐక్యతను చాటుతుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో బొడ్రాయి పండుగలు బాగా జరిగాయన్నారు. పండుగ సదర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి విద్యుత్ భద్రతా వారోత్సవాలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈనెల 28వ తేదీనుంచి విద్యుత్ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పట్టణ ఏడీ థావుర్యానాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 28వ తేదీన ఉదయం 8:30 గంటలకు మహబూబ్‌నగర్ సర్కిల్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో విద్యుత్ అవగాహన సదస్సు నిర్వహించనున్నటుల పేర్కొన్నారు. వినియోగదారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

3వ వార్డులో ఇళ్ల నిర్మాణం ప్రారంభం

జడ్చర్ల టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభింపజేశారు. ఇంటి నిర్మాణాలకు ఇదివరకే ప్రొసీడింగ్స్ ఇవ్వగా ముగ్గుపోసి శుక్రవారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సతీశ్, వార్డు అధికారి కృష్ణయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అనంతకిషన్ కాలనీవాసులు పాల్గొన్నారు.

టీఎమ్ఎమ్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మంజుల



మహబూబ్‌నగర్ రూరల్: టీఎమ్ఎమ్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి మంజులను ఎన్నుకున్నారు. ఈ మేరకు అంబేద్కర్ కళాభవన్‌లో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్సింహులు, రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాల మహిళలు అన్నిరంగాల్లో రాణించేందుకు వారిలో చైతన్యం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విద్యావతి పాల్గొన్నారు.

రెండ్రోజులపాటు నీటి సరాఫరా బంద్

దేవరకద్ర: మిషన్ భగీరథ ప్రధాన పైపుల లీకేజీల మరమ్మతుల కోసం రెండు రోజులపాటు నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ అధికారి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మన్యంకొండ నుంచి నారాయణపేట మార్గంలో మరికల్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్‌లు రెండు చోట్ల లీకేజీలు ఏర్పడిన కారణంగా పైపులను తొలగించి వాటి స్థానంలో కొత్త పైపులు వేసే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీనివల్ల శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి 29వ తేదీ ఆదివారం ఉదయం 8గంటల వరకు 36 గంటల పాటు నీటి సరాఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. దేవరకద్ర, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దేవరకద్ర, నర్వ, మరికల్, ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద మండలాలతోపాటు పాక్షికంగా ప్రభావిత మండలాలు కొౌకుంట్ల, చిన్నచింతకుంట, మక్తల్, ధన్వాడ, మున్సిపాలిటీలు దేవరకద్ర, మక్తల్, నారాయణపేటతోపాటు మొత్తం 245 గ్రామాలకు నీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు ఈవిషయంలో సహకరించాలని కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక శివశక్తి నగర్‌లోని శివాలయం వద్ద రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్‌వరల్డ్, కాంగ్రెస్ నాయకులు భరత్, నరేశ్, ముక్రం, కుమార్, ఫయీం, రవి, షకీల్, అనిత, హాదీ, వెంకటయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీనియర్ డెస్క్ జర్నలిస్టు తిరుపతయ్య

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్‌లోని నిరుపేద జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని సీనియర్ డెస్క్ జర్నలిస్టు తిరుపతయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీడియా రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకనుగుణంగా అనేక సమస్యలు ఉంటాయని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆ తర్వాత ప్రభుత్వంపై ఉందన్నారు. పేద జర్నలిస్టుల కోసం చేపట్టిన రిలే దీక్షలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మద్దతు పలకాలని కోరారు. రిలే దీక్షకు డెస్క్, వీడియో జర్నలిస్టులు పెద్దసంఖ్యలో వచ్చి సంఘీభావం తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. పాత్రికేయుల సమస్యలు పరిష్కారం చేయకుంటే పాలమూరులో అగ్నిగుండమేనని.. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఇప్పటికే ఐదోరోజు దీక్ష సందర్భంగా జిల్లా కేంద్రంలో అనేకమంది కుల సంఘాలు, ప్రజాసంఘాలు, కార్మికసంఘాలు ఉద్యోగ సంఘాలు ఇతరత్రా రాజకీయ పార్టీల నేతలు, దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారని గుర్తుచేశారు. భవిష్యత్‌లో జరగబోయే ఆందోళనలకు జర్నలిస్టులు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు మంత్రి నర్సింహయ్య, నేషనల్ కన్స్యూమర్ రైట్స్ ఫోరం నాయకులు బాలరాజు, రాజసింహుడు, డెస్క్ జర్నలిస్టులు కుర్మయ్య, మాణిక్‌రావు, రామస్వామి, నవీన్, జాఫర్, జమ్మన్న, నవీన్, చక్రవర్తి పాల్గొన్నారు.

కనీస సామర్థ్యాలను సాధించడమే లక్ష్యం


దోకూర్ కేజీబీవీలో బేస్‌లైన్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

దేవరకద్ర: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాంను ఆగస్టులో ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం దేవరకద్ర మండలం డోకూర్ సమీపంలోని కస్తూరిబా గాంధీ బాలికల విదాలయంలో 6నుంచి 9 వ తరగతి విద్యార్థులకు బేస్ లైన్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనూరాధ మాట్లాడుతూ విద్యార్థుల కనీస సామార్థ్యాలను సాధంచడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సంవత్సరం ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాంకు విద్యాశాక రూపకల్పన చేసిందని తెలిపారు. ఏం చదివారో ఏం నేర్చుకున్నారో చెప్పలేని పరిస్థితుల నుంచి విద్యార్థులను గట్టెక్కించేందుకు ఈ ప్రోగ్రాంకు విద్యాశాఖ శ్రీకారం చుట్టిందని తెలిపారు. పరీక్షలు 25 నుంచి ప్రారంభం కాగ 30 వ తేది వరకు నిర్వహించి మూల్యాంకనం చేసి వచ్చే నెల 15 తేది వరకు ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ విద్యాలయ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

డీఈఓ ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల టౌన్: ప్రణాళికాబద్ధంగా చదివితే పదిలో మంచి ఫలితాలు వస్తాయని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దేవునిగుట్ట తండా వద్ద ఉన్న కేజీబీవీని తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు సమీపించాక ఆందోళన చెందేబదులు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు వస్తాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు.

కమిషనర్‌కు పీఆర్టీయూ అభినందన


కమిషనర్‌ను అభినందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవల నగర పాలక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి పీఆర్‌టీయూ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు నాయకులు మాట్లాడుతూ.. పాలమూరు జిల్లాపై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్న వ్యక్తిగా ప్రవీణ్‌కుమార్‌కు ఎంతో అనుభవం ఉందని, ఆయన హయాంలో పాలమూరు ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్‌యాదవ్, సుధాకర్ రెడ్డి, బుచ్చారెడ్డి, జైపాల్‌రెడ్డి, పురుషోత్తగౌడ్, శ్రీహరి, చంద్రశేఖర్, రామచంద్రయ్య, గోపికాంత్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డులో శుక్రవారం డ్రైడేను నిర్వహించారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు ఇంటింటికి తిరిగి నిల్వనీటిని పార బోశారు. గుంతలు, నల్లా సంపుల్లో నిల్వ నీటిలో దోమల నివారణ మందులను వేశారు. అలాగే కొత్త బస్టాండ్ ప్రాంతంలోని గూరకొండ రోడ్, రాయిచూర్‌రోడ్ అమ్మాపూర్ రోడ్ తదితర ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల మధ్య నిలిచిన వర్షపు నీటిలో దోమల నివారణ మందులను వేశారు. తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని ఆరోగ్య కార్యకర్తలు సూచించారు.


నిల్వనీటిలో దోమల నివారణ మందు వేస్తున్న ఆశ వర్కర్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా నిర్వాహకులను సన్మానిస్తున్న ఫోరం నాయకులు

నవాబ్‌పేట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని భారత్ స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏడాది కాలంగా కొనసాగుతున్న ఉచిత యోగా కార్యక్రమాల సమితి వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. యోగా కార్యక్రమాలు నిత్యం మానవుడి దినచర్యలో భాగంగా మారే సందర్భం వచ్చిందని తెలిపారు. ఇప్పటికే ప్రపంచం మొత్తం యోగాకు దాసోహం అన్నట్లు కొనసాగుతుండడం విశేషమన్నారు. యోగాలో ప్రపంచంలో చరిత్ర సృష్టించిన దేశంగా నిలిచిందని తెలిపారు. ఉచితంగా యోగా శిక్షణ ఏడాదిగా కొనసాగించడం అభినందించదగ్గ విషయమన్నారు. యోగా కార్యక్రమాలు ప్రతి గ్రామంలో కొనసాగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి మనిషికి యోగా అలవాటుగా మారితే ఆస్పత్రులన్నీ మూతబడే రోజులు వచ్చినా సందేహంలేదని వివరించారు. ఈ సందర్భంగా యోగా నిర్వాహకులు జాతీయ అవార్డుగ్రహీత పురుషోత్తం, వెంకటేశ్వరప్ప, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు నర్సింహులును సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అమర్‌సింగ్, శ్రీనివాస్, రాజు, సిద్ధు, శ్రీనివాస్, చంద్రశేఖర్, బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, డాక్టర్ శివ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర


రథయాత్రనిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ ఆలయం నుంచి కావేరమ్మపేట శివాలయం వరకు శుక్రవారం రాత్రి విశ్వహిందూపరిషత్, హనుమాన్ చాలీసా పారాయణం బృందాలు సంయుక్తంగా జగన్నాథ రథయాత్ర నిర్వహించారు. భక్తులు సంకీర్తనలు, పాటలు పాడుతూ యాత్రలో పాల్గొన్నారు. పూరిలో రథయాత్ర పురస్కరించుకుని ఇక్కడ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజు, జ్యోతి, వీహెచ్‌పీ సభ్యులు లావణ్య, అఖిల్, నాగరాజు, సునీత, రాంరెడ్డి, వేణుగోపాల్, శివరేఖలు పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

- యువకుడికి గాయాలు

భూత్పూర్: పోతులమడుగు సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం రెండు మోటర్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. భూత్పూర్ నుంచి అన్నాసాగర్ వైపు మోటర్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న మరో మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. దీంతో విజయకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

తెరిచిన పశువైద్యశాల

సాక్షి ఎఫెక్ట్..

నవాబ్‌పేట: 'పశువైద్యం బహుదూరం' శీర్షికపై అధికారులు స్పందించి ఆస్పత్రి తాళం తీశారు. సిబ్బంది, అటెండర్ మాత్రమే హాజరయ్యారు. రెండుమూడు రోజులుగా ఆస్పత్రికి తాళం వేయడంతో గ్రామస్తులు చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా తాళం తీసి సిబ్బంది అందుబాటులో ఉన్నారు. డాక్టర్ ఉండాల్సిన ఆస్పత్రిలో అటెండర్‌తో ఎలా అంటూ రైతులు వాపోతున్నారు. ఈ విసయంలో వెంటనే డాక్టర్, వివిధ గ్రామాల్లో సిబ్బందిని నియమించాలని ఆయ గ్రామాల రైతులు కోరుతున్నారు.



తెరుచుకున్న కొల్లూర్ పశువైద్యశాల

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రగతి శూన్యం

- ఏడాదిన్నరలో ఏం చేశామో చూపిస్తాం
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: నియోజకవర్గం అభివృద్ధికి సంబంధించి బీఆర్ఎస్ పాలనలో ఏం చేశారో చూపాలని తమ ఏడాదిన్నర పాలనలో ఏం సాధించామో ప్రజల ముందుంచుతామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక సిగ్నల్‌గడ్డ వద్ద లయన్స్‌క్లబ్ మొదటి అంతస్తు వ్యాపార దుకాణా సముదాయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. పెద్దాయపల్లి వద్ద ఇప్పటికే యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని, అక్కడ మరో 20 ఎకరాల స్థలం సిద్ధంగా ఉందని నవోదయ స్కూల్ ఏర్పాటు చేస్తామంటే ఇస్తామన్నారు. లేకుంటే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి స్థల కేటాయిస్తామని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు కూడా స్థల పరిశీలన చేస్తున్నామని, మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు చేస్తామన్నారు. జడ్చర్లలో భూకబ్జాలు, రౌడీ, గూండాయిజం తగ్గాయని, అవినీతి రహిత పాలన సాగుతందంటూ సీఎం తనను ప్రశంసించారని పేర్కొన్నారు. ఇక మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. జడ్చర్ల నియోజకవర్గం అభివృద్ధికి ఆయన తీవ్ర అన్యాయం చేశారన్నారు. నియోజకవర్గంలోని ఊర్కొండ మండలాన్ని కల్వకుర్తి రెవెన్యూ డివిజన్‌లోకి నెట్టి జడ్చర్ల రెవెన్యూ డివిజన్‌ను విస్మరించారన్నారు. జడ్చర్ల అభివృద్ధి చెందాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అనివార్యమని భావించి కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అదేవిధంగా కొత్తకోట రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి కూడా ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఉత్తర తెలంగాణాకు వెళ్లే ట్రిపుల్ ఐటీని మన దగ్గరకు తీసుకొచ్చామన్నారు. సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, మాజీ జెడ్పీటీసీ శివకుమార్, లయన్స్ నటరాజ్, డాక్టర్ రాంరెడ్డి, కాల్వ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయన్న ఆశయాలను కొనసాగిస్తాం

- పండుగ సాయన్న సేవా సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణముదిరాజ్
- రాంచంద్రాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిస్తామని పండుగ సాయన్న సేవా సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలలోని రాంచంద్రాపూర్‌లో ప్రజావీరుడు పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాయన్న ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సాయన్న జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. పండుగ సాయన్న విగ్రహాన్ని వచ్చేనెల 17వ తేదీన ప్రతిష్ఠంచనున్నట్లు, కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి బాలగోపి, రజక సంఘం అధ్యక్షుడు శివన్న, గ్రామపెద్దలు పద్మ, నారాయణ, రాములు, తిరుపతయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను సన్మానించిన మాజీ సైనికులు


కమిషనర్‌ను సన్మానిస్తున్న మాజీ సైనికుకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల మహబూబ్‌నగర్ నగరపాలక కమిమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని మాజీ సైనికులు సన్మానించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. నగర అభివృద్ధికి తమవంతు సహకరిస్తామన్నారు. అందరం కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు ఎంఆర్‌కే రెడ్డి, సలహాదారుడు వెంకటయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ విక్రమ్

నవాబ్‌పేట: విద్యార్థి దశనుంచే దురలవాట్లుకు దూరంగా ఉండేవారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఎస్సై విక్రమ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని చాణుక్య పాఠశాలలో డ్రగ్స్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ విస్మరిస్తే దురలవాట్లు దరిచేరి డ్రగ్స్‌కు బానిసగా మారి సమాజంలో అలజడులు రేపటం, జల్సాలకు అలవాటు పడి దోపిడీలు తదితర వాటిలో భాగస్వాములయ్యే ప్రమాదం ఉందని వివరించారు. క్రమశిక్షణతో కూడిన విద్యనేర్చుకుని మాదకద్రవ్యాలు లేని సమాజనం నిర్మించేలా ప్రతి వ్యక్తి కృషి చేయాలన్నారు. డ్రగ్స్ విషయంలో ప్రతి వ్యక్తి అవగాహన పొంది వాటి నష్టాలను ప్రతివ్యక్తికి తెలిసేలా చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సునీల్, సందీప్ పాల్గొన్నారు.

మండలానికి స్థానిక ఎన్నికల సామగ్రి


ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని దించుతున్న సిబ్బంది

నవాబ్‌పేట: మండలానికి స్థానిక ఎన్నికలకు సంబంధించి సామగ్రి శుక్రవారం ప్రత్యేక వాహనలో మండలానికి వచ్చిందని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. దాన్ని గ్రామాలవారీగా ఏర్పాటు చేసే పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి స్టేషనరీ పనులు ఇప్పటికే పూర్తి కాగా మిగతా పనులు తాజాగా మొదలైనట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలానికి సామగ్రి రావడంతో ఎన్నికల ప్రక్రియ మొదలైనట్లేనంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాడమాస మొదటి శుక్రవారం కావడంతో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళా భక్తుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించి లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం వాసవీమాత పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కల్వ కన్నయ్య, కమలమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.